


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 350 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 20 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :350 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 20 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి
- అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు.మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక

- మిగతా 2లో

## మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్య
- మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రామయ్య
- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు లోకేశ్‌కు కృతజ్ఞతలు
- కూటమి విజయాలను మండలిలో వినిపించాలని సూచించిన మంత్రి



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు

- మిగతా 2లో


# ఎన్నికలకు సిద్ధంకండి.. గెలుపే లక్ష్యంగా పని చేయండి

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు.

వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.




## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

### అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం
- సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి,

- మిగతా 2లో



## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

పెన్ పవర్ డెస్క్: త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి ప్రకటించారు.

- మిగతా 2లో



## బెట్టింగ్ యాప్స్ కేసు

### ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

- ఈడీ విచారణకు హాజరైన నటి నిధి అగర్వాల్
- బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో విచారణ
- హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- ఇప్పటికే పలువురు నటులను ప్రశ్నించిన ఈడీ

- మిగతా 2లో

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి



పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫొటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లతో

- మిగతా 2లో



## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో భేటీ, లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ సమావేశం

- మిగతా 2లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

- మిగతా 2లో

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు



పెన్ పవర్ డెస్క్: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమ ల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి

- మిగతా 2లో

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..




పెన్ పవర్ డెస్క్: మేయర్, మున్సిపల్ చైర్మెన్ ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది ఏపీ అసెంబ్లీ. బుధవారం ( ఆగస్టు 19 ) సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు మంత్రి నారాయణ. ప్రస్తుతం మేయర్,

- మిగతా 2లో



## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నాగబాబుకు పదవి... పవన్ ఇక మారేట్లులేరుగా?

జనసేనలో ఏ పదవి అయినా నేతలు ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ వారి ఆశలు మాత్రం అడుగంటుతూనే ఉన్నాయి. పవన్ కల్యాణ్ తన కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జెండా మోసిన వారిని పట్టించుకోవడం లేదన్న విమర్శలకు మరింత బలం చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా 'ఏపీ గ్రీన్' ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబు పదవిని కేటాయించింది. కేబినెట్ ర్యాంకు పదవి. నామినేటెడ్ పోస్టు. అన్నింటా సామాజికన్యాయం, తనకు కులం, కుటుంబంతో సంబంధం లేదని పదే పదే చెప్పే పవన్ కల్యాణ్ పదవుల విషయానికి వచ్చేసరికి తనకే ప్రయారిటీ ఇవ్వడాన్ని ప్రశ్నించలేకపోతున్నారు కానీ, సోషల్ మీడియాలో మాత్రం ఈ నిర్ణయం పై వ్యతిరేకత తీవ్రంగానే కనిపిస్తుంది.

**మంత్రివర్గంలో చోటు దక్కుతుందని...**

నాగబాబుకు మంత్రివర్గంలో పూర్తి స్థాయి బెర్త్ లభిస్తుందని భావించారు. తమకు నామినేటెడ్ పోస్టు దక్కుతాయని జనసేన క్యాడర్ మరియు నేతల్లో ఈ నిర్ణయం కొంత నిరుత్సాహానికి, చర్చకు దారితీసింది. ఏపీ సైంటిఫిక్ అండ్ ఎకోలాజికల్ గ్రీనింగ్, రీఫారేస్టేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా నియమించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న అటవీ మరియు పర్యావరణ శాఖ పరిధిలోనే ఈ నియామకం జరిగింది.జనసేన వర్గాల్లో చర్చ మాత్రం మొదలయింది. అసలు తమకు ఎప్పటికైనా పదవి లభిస్తుందా? అన్న అనుమానాలు వారిలో కనిపిస్తున్నాయి. నాగబాబు హైదరాబాద్ లోనే ఎక్కువగా ఉంటారు. పార్టీ కోసం ఆయన పడిన దానికంటే రెట్టింపు కష్టపడిన వారు అనేక మంది జనసేనే నేతలు ఉన్నారు. తమ ఆస్తిపాస్తులను కూడా పోగొట్టుకున్నారు.

**ప్రత్యేకత ఏంటి?**

ఎన్నికల నుంచి పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రివర్గంలో ప్రత్యక్ష స్థానం దక్కుతుందని అందరూ భావించారు. కానీ కేబినెట్ లో చోటు లభించలేదు. ఇది మంత్రి పదవి కాకపోవడంతో ఆ పదవి వేరే వారికి ఇవ్వవచ్చు కదా?అన్న ప్రశ్న తలెత్తుతుంది. నాగబాబు ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయనకు అదనంగా ఈ పదవి ఎందుకు అన్న ప్రశ్న సహజంగానే జనసైనికుల్లో ఎదురవుతుంది. నిజానికి నాగబాబు వల్ల పార్టీకి ప్రత్యేకంగా ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, పవన్ కున్న క్రేజ్, ఇమేజ్ ఆయనకు లేదని, అటువంటి నాగబాబుకు పదవి ఇవ్వడం ఏంటని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కానీ పవన్ తాను చేసిందే శాసనం.. చెప్పిందే చట్టం అని వ్యవహరిస్తున్నారని, ఈ నిర్ణయాల వల్ల జనసేనకు రాజకీయంగా నష్టం జరుగుతుందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే పవన్ కళ్యాణ్ తన సొంత అన్నకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వకుండా, పాలనాపరమైన కార్పొరేషన్ పదవితో సరిపెట్టడం ద్వారా రాజకీయ విమర్శలకు తావులేకుండా ఉండే వ్యూహాత్మక నిర్ణయంగా పరిశీలకులు భావిస్తున్నారు.

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు

- మొదటి పేజి తరువాయి

వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు."రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది.

**రూపారెడ్డి**

నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.

సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు.వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు.జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా,

మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.

గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు.

ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు

# మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వర్ల రామయ్య, అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మంత్రి లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేశ్‌కు వర్ల రామయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరువురు నేతలు కాసేపు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శాసనమండలిలో కూటమి ప్రభుత్వ విజయాలను, ప్రజా అనుకూల విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వర్ల రామయ్యకు సూచించారు. సభలో ప్రజా సమస్యలపై తమ వాణిని బలంగా వినిపించాలని కోరారు. వర్ల రామయ్య వంటి అనుభవజ్ఞుడి సేవలు మండలికి ఎంతో అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

# 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి

"సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సీట్లు కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.గతంలో 2007లో "హాథీ నహీ గణేశ్ హై.. బ్రహ్మ, విష్ణు, మహేశ్ హై" అనే వినూత్న నినాదంతో బీఎస్పీ 206 స్థానాలను కైవసం చేసుకుని, 30 శాతం ఓట్ షేర్‌తో అధికార పీఠాన్ని అధిష్ఠించింది. అయితే, ఆ తదుపరి ఎన్నికల్లో పార్టీ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానానికి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా స్థానాలకు పార్టీ పరిమితమైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుమారు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండగా, మాయావతి అనుసరిస్తున్న ఈ పాత ఫార్ములా ఆమెకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అనేది వేచి చూడాలి.

# భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.

ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి

- మొదటి పేజి తరువాయి

కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు.

వివరాల్లోకి వెళితే.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫొటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫొటోలు తీశారు. తాను తీసిన ఫొటోలను తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి. ప్రతి చిత్రం రాబోయే తరాల కోసం కాలంలోని ఒక భాగాన్ని భద్రపరుస్తుంది. స్ఫూర్తినిచ్చే క్షణాలను బంధిస్తూ ఫొటోగ్రఫీ కమ్యూనిటీ ముందుకు సాగాలి" అంటూ చంద్రబాబు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

- మొదటి పేజి తరువాయి

బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుక వినిపించేందుకు కొత్త పార్టీ స్థాపిస్తానని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం లేకుండా దేశం సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు.

## మేయర్, మున్సిపల్ ఛైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..

- మొదటి పేజి తరువాయి

మున్సిపల్ ఛైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న క్రమంలో ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది ప్రభుత్వం. ఈ సందర్భంగా సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 1986 వరకు మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని... అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని.. 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని అన్నారు నారాయణ. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ ఛైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు మంత్రి నారాయణ.ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, ఛైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్, ఛైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని అన్నారు.

ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, ఛైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుంది.

రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుంది.

అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం, పనులు వేగవంతం.

నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుంది.

ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా ఛైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.

## బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు.బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు.ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం



# తాళాలకే పరితమైన ఆరోగ్య సేవలు

### సిబ్బంది గైర్హాజరు.. రోగులు రోడ్డున

### అధికారుల ఉదాసీనతపై గ్రామస్తుల ఆగ్రహం

**తర్లుపాడు పెన్ పవర్ ఆగస్టు 19**

తర్లుపాడు మండలం తుమ్మలచెరువులో బుధవారం రోజున ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పరిస్థితి దయనీయంగా మారింది. సిబ్బంది గైర్హాజరు, తాళాలు వేసి ఉండటంతో అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం దొరకక నిరాశతో వెనుతిరుగుతున్నారు.

**పి హెచ్ సి కి తాళం.. సిబ్బంది మాయం..**

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాల్సిన తుమ్మలచెరువు పీహెచ్ సి రోజూ తాళం వేసే ఉండటం గమనార్హం. కేటాయించిన వైద్యుడు, ఏఎన్ఎం, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో కేంద్రం వెలవెలబోతోంది. ప్రభుత్వం ఉచిత వైద్యం, మందులు ఇస్తున్నా సిబ్బంది లేక ప్రజలు లబ్ధి పొందలేకపోతున్నారు.

**దూరం నుంచి వచ్చి నిరాశ...**

తుమ్మలచెరువు చుట్టుపక్కల పలు గ్రామాలకు ఇదే ప్రధాన ఆరోగ్య కేంద్రం. జ్వరం, డయేరియా, గాయాలు, గర్భిణీ చెకప్‌ల కోసం వచ్చే పేద రోగులు తలుపులు మూసి ఉండటంతో తిరిగి వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో కూడా ఇక్కడ ఎవరూ ఉండకపోవడంతో మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీయాల్సి వస్తోంది.

**అధికారుల ఉదాసీనత...**

స్థానికులు ఎం హెచ్, ఓ డిఎంహెచ్ ఓ కార్యాలయాలకు ఫిర్యాదులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఒక్కసారి కూడా తనిఖీకి రాకపోవడంతో సిబ్బందికి భయం లేకుండా పోయింది. పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

**ప్రమాదంలో ప్రజారోగ్యం...**

సమయానికి వైద్యం అందకపోవడంతో సాధారణ జ్వరాలు, ఇన్ఫెక్షన్లు కూడా ముదురుతున్నాయి. గర్భిణులు చెకప్‌ల కోసం ఆటోలు కట్టుకుని



దూరంగా వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో విషజ్వరాలు, దోమల వ్యాధులు పెరిగే అవకాశం ఉండగా పి హెచ్ సి మూతపడటం ప్రజారోగ్యానికి ప్రమాదకరం.

**గైర్హాజరు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి...**

విధులకు క్రమం తప్పకుండా గైర్హాజరవుతున్న సిబ్బందిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించని వారిని సస్పెండ్ చేయాలని కోరుతున్నారు. ప్రతిరోజూ హాజరు రిజిస్టర్ తనిఖీ చేయాలని సూచిస్తున్నారు.

**ప్రత్యామ్నాయ సిబ్బంది అవసరం...**

ఒకే సిబ్బందిపై ఆధారపడకుండా షిఫ్ట్ విధానంలో పనిచేసేలా ప్రత్యామ్నాయ ఏఎన్ఎం లేదా కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా పి హెచ్ సి తెరిచి ఉండేలా చర్యలు తీసుకోవాలి. 108 అంబులెన్స్ సేవలతో సమన్వయం కూడా ఉండాలని అంటున్నారు.

**ప్రజాప్రతినిధులు స్పందించాలి...**

ఈ సమస్యను వెంటనే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. వచ్చే వారం లోపు చర్యలు తీసుకోకపోతే పి హెచ్ సి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన నార్కెట్పల్లి హైవేలి

### ఆక్రమణకు గురైన ప్రధాన రహదారి

### కొమ్మాలపాడు ప్రధాన రహదారిపై అడ్డంగా నిలుస్తున్న వాహనాలు

### జరుగుతున్న ప్రమాదాలకు కమర్షియల్ షాపులే కారణమా ?

**సంతమాగులూరు, పెన్ పవర్ ఆగస్టు 19**

సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలోని మేదరమెట్ల నార్కెట్ పల్లి రహదారి ఇష్టానుసారంగా ఆక్రమణకు గురైంది. కమర్షియల్ షాపుల కారణంగా వాహనాలను రద్దీగా రహదారిపైనే నిలిపివేయడం జరుగుతుంది. రోడ్లకు ఇరువైపులా షాపుల బయటే వాహనాలను నిలిపివేయడంతో ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనాలకు ఎంతో ఇబ్బందికరంగా మారింది. రహదారి మార్జిన్ నుండి 120 అడుగుల దూరం ఉండవలసిన మార్జిన్ కనీసం 10 అడుగులు దూరం కూడా లేక వాహన సోదరులు ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు కొమ్మాలపాడు పెద్ద సెంటర్ కావడంతో ఇరుసంధ్య సమ యాలలో టీ టిఫిన్ వంటి నిత్యవసర అవసరాల కొరకు కమర్షియల్ షాపులలో కొనుగోలు చేయుటకు వాహనాలు ఎక్కువగా నిలుపుదల చేయడం జరుగుతుంది. దీని కారణంగా మార్జిన్ లేక వాహన సోదరులకు అనేక ప్రమాదాలకు దారితీస్తుంది. గత నెలలో సజ్జాపురం లోని ఒక వాహన చోదరుడు తన తల్లితో ప్రయాణిస్తుండగా కొమ్మాలపాడు సెంటర్లో లారీ తగిలి అక్కడికక్కడే తల్లి, కొడుకు మృతి చెందడం జరిగింది. ఇలా నిత్యం ప్రమాదంలో మునిగి తేలుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సంబంధిత టోల్ ప్లాజా వారు ఈ సమస్యను ఇప్పటికైనా స్పందించి ఈ కొమ్మాలపాడు సెంటర్లోని మార్జిన్ ను రహదారి విస్తరణ చేపట్టి రోడ్డు ప్రమాదాలు అడగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు , వాహన చోదరులు వాపోయారు.





# స్వర్ణ గ్రామంలో కాళి కుర్చీలు

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం







**వెన్ పవర్ తర్లుపాడు ఆగస్టు 19**

మండలంలోని చెన్నారెడ్డిపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో అధికారుల సమయపాలన లేమి, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. బుధవారం సచివాల యానికి వచ్చిన ప్రజలకు ఖాళీ కుర్చీలు మాత్రమే దర్శనమిచ్చాయి. కార్యాలయంలో ఒక వెల్ఫేర్ అసిస్టెంట్ తప్ప మరెవరూ అందుబాటులో లేకపోవడంతో, వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయ సిబ్బంది కోసం ఒక వృద్ధుడు గంటల తరబడి పడిగాపులు కాస్తున్న దృశ్యం అందరినీ కలిచివేసింది. కార్యాలయానికి వచ్చి హాజరు వేసిన అనంతరం, "ఫీల్డ్ వర్క్" నెపంతో సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నారని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

**సమయపాలన లోపం -- పర్యవేక్షణ కరవు:**

**మూమెంట్ రిజిస్టర్ నిల్:** విధులకు వెళ్లే సమయంలో మూమెంట్ రిజిస్టర్‌లో ఎక్కడికి వెళ్తున్నారో నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ, సిబ్బంది ఆ నిబంధనను పూర్తిగా గాలికి వదిలేశారు.

**ఉన్నతాధికారుల నిర్లక్ష్యం:** ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడం వల్లే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రజల ప్రదక్షిణలు:** చిన్న చిన్న పనుల కోసం కూడా సచివాలయం చుట్టూ రోజులు తరబడి తిరగాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను తీర్చడానికి ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విధులకు గైర్హాజరైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కార్యాలయంలో సమయపాలన పాటించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ చరిత్రాత్మకం

### -బీసీల రాజకీయ సాధికారతకు ఇది కీలక ముందడుగు -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 19**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ సాధికారత అనే లక్ష్యాలకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తీసుకున్న ఈ నిర్ణయం మరింత బలం చేకూరుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీ బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ, వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీల రాజకీయ సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వారి చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా ఒక చరిత్రాత్మక అడుగని చెప్పారు. రాష్ట్ర జనాభాలో బీసీలు




గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ, గతంలో స్థానిక సంస్థల్లో వారికి ఆశించిన స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు బీసీలకు పాలనలో మరింత భాగస్వామ్యం కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, ఇతర స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు చెందిన ప్రజలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై తమ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేందుకు ఈ రిజర్వేషన్ దోహదపడుతుందని తెలిపారు. బీసీలకు కేవలం రాజకీయ రిజర్వేషన్ కల్పించడం మాత్రమే కాకుండా, వారి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కండి - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేఠా

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 19**

స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ఆధారంగా రిజర్వేషన్ సీట్లను నిర్ణయించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల సర్వే సమర్థంగా పూర్తి చేయాలన్నారు. తదుపరి సీట్లను నిర్ధారించాలన్నారు. ఎన్నికల సామగ్రి కొనుగోలు చేపట్టాలన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికల సామాగ్రి కేటాయింపు ఉంటుందని, మిగతావి స్థానికంగా కొనుగోలు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి, బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవాలన్నారు.



ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలంటూ పలు సూచనలు చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలకాగానే అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితాకు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అనుసరించి గ్రామ పంచాయతీలలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్



స్థానిక సభ్యుల ఎన్నికల ఏర్పాట్లకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నం గాకుండా ప్రణాళికతో అధికారులు పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి, డిపిఓ అనుపమ, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ బాలమ్మ, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయానికి సీలింగ్ ఫ్యాన్ విరాళం




**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 19**

ఒంగోలు నగరానికి చెందిన దివంగత బయ్యావరపు వై.ఎల్. నరసింహ బాబు జ్ఞాపకార్థం వారి కుమారుడు బయ్యావరపు దత్త ప్రవీణ్ రూ.2,300/- విలువైన హ్యావెల్స్ కంపెనీ సీలింగ్ ఫ్యాన్‌ను బుధవారం విరాళంగా అందజేశారు. గ్రంథాలయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దాతృత్వంతో ఫ్యాన్‌ను అందజేసిన బయ్యావరపు దత్త ప్రవీణ్ కి వారి కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్ర గ్రంథాలయం తరపున ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని, ఇలాంటి సేవాభావం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది యం. శ్రీనివాసులు, యం. శివకుమారి, యస్.అనిల్ బాబు, బి.రచన పాల్గొన్నారు.

# శ్రీ సాయి సేవ ఆశ్రమంలో మొక్కలు పంపిణీ కార్యక్రమం

**పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు 78వ జన్మదిన వేడుకలలో భాగంగా మొక్కలు పంపిణీ కార్యక్రమం**





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 19**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలోని శ్రీ సాయి సేవ ఆశ్రమం నందు బుధవారం పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు 78 వ జన్మదిన సాయి సేవ ఆశ్రమ అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షిరిడి సాయి సేవశ్రమం మక్కెనవారిపాలెంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు భక్తులచే అభిషేకాలు అలంకరణలు చేయించారు. అంతరం భక్తులకు మొక్కల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ పూజ్య గురుదేవులు అమ్ముల సాంబశివరావు సాక్షాత్ దైవ స్వరూపులని, శ్రీ సాయి సేవ ఆశ్రమాలు ఎన్నో కట్టించారని, మన తెలుగువారి ఆశ్రమం మొదటిగా షిరిడి లో కూడా అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో కట్టించడం జరిగిందని, పచ్చదనం పరిరక్షణ పర్యావరణానికి ఎంతో ముఖ్యమని, ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మొక్కలు మొక్కలు నాటాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్కెన భక్తులు పాల్గొనడం జరిగింది.

# హెచ్ఐవిపై అవగాహన

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 19**

గిద్దలూరు మండలం గిద్దలూరు లోని సెయింట్ పాల్ హై స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ఇంటెన్సిఫైడ్ ఐఈ సి క్యాంపెయిన్ భాగంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాక్షన్ లెడ్ దిశా ఈ సదస్సులో హెచ్ఐవి అనగానేమి అది ఎలా వ్యాప్తి చెందుతుంది హెచ్ఐవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి హెచ్ఐవి ఎయిడ్స్ సంబంధించిన అపోహాలు లక్షణాలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం అదేవిధంగా యువత డ్రగ్స్ కు బానిసలు కాకుండా జాగ్రత్తగా ఉండాలని ఈ వ్యాధికి చికిత్స లేదు నివారణ ఒకటే మార్గం. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో తెలియజేయడం సుఖ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం హెచ్ఐవి ఎయిడ్స్ ఆక్ట్ 2017 గురించి చెప్పడం ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్ రమేష్ , పి తిరుపతయ్య ఈ రాజేశ్వరి , ఈ రవిచంద్ర హెచ్ ఓ సిబ్బంది వై దుర్గ భవాని, రిప్కా సునీత తదితరులు పాల్గొన్నారు.




# హెల్మెట్ మీ ప్రాణాలకు రక్ష -నైపుణ్యమే మీ భవిష్యత్తుకు దిక్సూచి

## - బీటెక్ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన ఆర్టీఓ నాగలక్ష్మి

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 19**

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తి, కెరీర్‌పై స్పష్టమైన దిశానిర్దేశం కల్పించే లక్ష్యంతో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో "సేఫ్ క్యాంపస్ -- సేఫ్ స్టూడెంట్స్" కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కందుకూరు ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీఓ) టీవీఎన్ నాగలక్ష్మి ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు.ప్రాణం అమూల్యం... రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొన్న ఆమె, విద్యార్థులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణించకూడదని స్పష్టం చేశారు. బాలికలు తాము ప్రయాణించే వాహనాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చట్టబద్ధమైన వయస్సు రాకముందే వాహనాలు నడపడం నేరమని, అలాంటి చర్యలకు చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

అనంతరం రవాణా శాఖ తరఫున తానే రచించి ఆలపించిన "రహదారి భద్రత" పాటను విద్యార్థులకు వినిపించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఆ పాటకు విద్యార్థులు ఘనంగా చప్పట్లతో అభినందనలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుపై మాట్లాడిన నాగలక్ష్మి జీవితంలో 99 శాతం సమయాన్ని కెరీర్ కోసం, కేవలం 1 శాతం మాత్రమే వినోదం కోసం కేటాయించండి అంటూ పిలుపునిచ్చారు. నైపుణ్యాలే విజయానికి పునాది అని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తే విజయాన్ని



ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండి, నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జపాన్‌లో ప్రాచుర్యం పొందిన ఓ సూక్తిని ఉటంకిస్తూ ఎవరైనా చేయగలిగితే మీరు కూడా చేయగలరు ఎవరూ చేయలేకపోయినా మీరు చేసి చూపించగలరు అని పేర్కొని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. చివరిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, "తల్లిదండ్రులు గర్వపడేలా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించండి. మీరు నేర్చుకున్న రోడ్డు భద్రత నియమాలను కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేసి సమాజానికి, దేశానికి ఉపయోగపడే యువతగా ఎదగండి" అని పిలుపునిచ్చారు.

అంతకుముందు కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్



ముఖ్య అతిథికి స్వాగతం పలికి, కళాశాలలో అందుబాటులో ఉన్న డిజిటల్ మార్కెటింగ్ ట్రైనింగ్ సెంటర్, పీఈసీ మీడియా సెల్, క్యాంపస్‌లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐ-స్పెషియల్ సంస్థ తదితర సౌకర్యాలను పరిచయం చేశారు. అనంతరం కళాశాలను సందర్శించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవికుమార్ మాట్లాడుతూ, ఆర్టీఓ నాగలక్ష్మి అందించిన స్ఫూర్తిదాయక సందేశాలు విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పుకు దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి విద్యార్థి డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆమె ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డా. సురియా షిహాబ్, ఎంబీఏ విభాగాధిపతి డా. లక్ష్మీ పావని ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. సురియా షిహాబ్, డా. లక్ష్మీ పావని, డా. రామ్ ప్రసాద్, బాల బ్రహ్మాచారి, ఆశా జ్యోతి, సులోచన, శైలజ, మహబూబ్ భాష తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రథమ సంవత్సరం బీటెక్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎంపీ వైవి సుబ్బారెడ్డి





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 19**

కనిగిరి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు సి ఎస్ పురం ,కోవిలంపాడు ,శీలంవారిపల్లి గ్రామాల కూడలి వద్ద తన సొంత నిధులతో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సాయిబాబ దేవస్థానాలను నిర్మిస్తున్నారు .మంగళవారం రాత్రి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి , మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ నిర్మాణంలో ఉన్న ఆలయాలను సందర్శించారు.కదిరి బాబురావు వెంకటేశ్వర స్వామి ,సాయిబాబా ఆలయాలను నిర్మించడం పట్ల ఎంపీ వైవి సుబ్బారెడ్డి అభినందించారు .ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వై.యం.ప్రసాద్ రెడ్డి,కనిగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, మాజీ యం.పి.పి.మూడమంచు వెంకటేశ్వర్లు,మాజీ జడ్పీటీసీలు గుంటక తిరుపతి రెడ్డి, మడతల కస్తూరి రెడ్డి, మండల వైసీపి అధ్యక్షులు పి మల్లిఖార్జున్ రెడ్డి ,డాక్టర్ పెరుగుమురళి కృష్ణ,మాజీ సింగల్ విండో అధ్యక్షులు జయరామి రెడ్డి, ఏ.యం.సి మాజీ డైరెక్టర్ ఇర్ల వీరాంజనేయులు,నారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి,ఇరగని చలపతి రావు,తదితరులు ఉన్నారు.

# 53వ పర్యాయం రక్తదానం చేసిన లొక్కు శరత్ బాబు.

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా బుధవారం రక్తదానం చేసిన శరత్ బాబు -పలువురు అభినందనలు.



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 19**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొమరోలు మండల దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు లొక్కు శరత్ బాబు బుధవారం 53వ పర్యాయం రక్తదానం చేసి పలువురితో అభినందనలు పొందారు. కొమరోలు మండలం బాదినేని పల్లి గ్రామానికి చెందిన లొక్కు శరత్ బాబు దివ్య హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ స్థాపించి గత దశాబ్ద కాలంగా అనేక సేవా కార్యక్రమాలను చేస్తూ అభినందనలు ప్రశంసలు పొందుతున్నారు. ఇప్పటివరకు ఆయన 52 పర్యాయాలు రక్తదానం చేసి పలువురు రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడారు. కాగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం 53వ పర్యాయంగా శరత్ బాబు రక్తదానం చేశారు. దీనితో రక్తదానం శిబిరం నిర్వహించిన నిర్వాహకులు, పలువురు సామాజికవేత్తలు, పలు సేవా సంస్థల ప్రతినిధులు శరత్ బాబుకు అభినందనలు తెలిపారు. అన్ని దానాలలో కెల్లా రక్తదానం గొప్ప దానమని, ప్రాణాపాయంలో ఉన్న రోగులకు పునర్జన్మ ఇచ్చేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని, అలాంటి గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లొక్కు శరత్ బాబు అభినందనీయులని పలువురు పేర్కొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్టు 19**



ఎల్ ని ఓ ప్రభావం కారణంగా రైతులు ఆరుతడి పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు చిరుధాన్యల సాగు పై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కే, నీరజ అన్నారు.బుధవారం మండలం లోని వీరభద్రపురం, మొగుళ్ళపల్లి,గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తక్కువ తేమను తట్టుకొనే ఆముదం పంట సాగు చేయవచ్చని ఉన్న కొద్దిపాటి నీటిని బిందు సేద్యం ద్వారా మాత్రమే వినియోగించాలని సూచించారు. నేలలో తేమ ఆవిరి కాకుండా ఉండడానికి పంట వరసల మధ్య ఎండు గడ్డి లేదా ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను వాడాలని తెలిపారు. ఒకే పంట పై ఆధారపడకుండా కందులు జొన్నలు లేదా పెసర్లు వంటి అంతర పంటల పద్ధతులను పాటించడం వలన కరువు వచ్చిన కనీస ఆదాయం దక్కుతుంది అని తెలిపారు .పశువుల ఎరువు, వానపాముల ఎరువు వాడటం వలన నేల నీటిని పట్టి ఉంచే సామర్థ్యం పెరుగుతుందని,రైతులకు కావలసిన యూరియా మరియు డి ఏ పి లను రైతు సేవా కేంద్రం ద్వారా నిరంతరం సరఫరా చేస్తున్నామని తెలియజేశారు. పంటల మార్పిడి ఉచిత సాంకేతిక సలహాల కోసం మీ పరిధిలోని రైతు సేవ కేంద్ర సిబ్బందిని లేదా మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవలసినదిగా కోరారు. అనంతరం రైతులు సాగు చేస్తున్న ప్రత్తి మరియు మిరప పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

# బీసీలకు చారిత్రాత్మక నిర్ణయం

**-స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్‌కు క్యాబినెట్ ఆమోదం**

**-16,500 బీసీ పోస్టులు తిరిగి వచ్చాయి**

**-హర్షం వ్యక్తం చేసిన ముచ్చు శ్రీనివాస యాదవ్**



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 19:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేక తీర్మానం చేసి ఆమోదం తెలిపింది.గత ప్రభుత్వం 34 శాతం నుండి 24శాతం కు తగ్గించడంతో బీసీలకు 16,500 పోస్టులు కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ 34శాతం రిజర్వేషన్ పునరుద్ధరించడంతో బీసీల హక్కు తిరిగి వచ్చింది.

ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముచ్చు శ్రీనివాసులు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం రిజర్వేషన్ కాదని, బీసీల భవిష్యత్తుకు భరోసా అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు కి ఆయన శతకోటి వందనాలు తెలిపారు. జిల్లాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శాలువాలు కప్పి, స్వీట్లు పంచుకున్నారు.

# నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం అబివృద్ధి కి 2 కోట్లు మంజూరు

**శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన అభివృద్ధికి సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి కి ధన్యవాదాలు తెలిపిన కమిటీ సభ్యులు**

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 19**

రాచర్ల మండలం జే.పీ.చెరువు గ్రామంలో వెలసిన శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామి వారి దేవస్థాన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. దేవాలయ చైర్మన్, ఆలయ అర్చకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం పరుస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విజయవాడ సచివాలయం వద్దకు వెళ్లి గిద్దలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ద్వారా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని కలిసి శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయడం ఎంతో సంతోషకరమని ఈ నిధులతో ఆలయ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి సహకరిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి దేవస్థాన కమిటీ సభ్యులు రాచర్ల మండల నాయకులు, ఆలయ అర్చకులు , గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి ఏకగ్రీవ ఎన్నిక

### -ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం - సభా గౌరవాన్ని కాపాడుతా --తూమాటి మాధవరావు

### -నూతన డిప్యూటీ చైర్మన్‌కు ఎమ్మెల్సీలు, రాజకీయ ప్రముఖుల అభినందనలు





**కందుకూరు పెన్ పవర్,ఆగస్టు 19**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన శాసనమండలి ప్రాంగణంలో డిప్యూటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ చైర్మన్ పదవికి తూమాటి మాధవరావు పేరు ఏకగ్రీవంగా ఖరారైన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు, మండలి అధికారులు, సిబ్బంది మాధవరావుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

**సభా వ్యవహారాల నిర్వహణకు కృషి...**

డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తూమాటి మాధవరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. శాసనమండలిలో సభ్యులందరికీ సముచిత అవకాశం కల్పిస్తూ సభా వ్యవహారాలను సజావుగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై శాసనమండలిలో విస్తృతంగా చర్చ జరిగేలా ప్రాధాన్యం ఇస్తామని, సభ్యులు లేవనెత్తే ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లే విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని చెప్పారు. శాసనమండలి ప్రతిష్ఠ, సభా గౌరవాన్ని కాపాడుతూ రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.

**సభ్యుల సమస్యలకు ప్రాధాన్యం...**

శాసనమండలి ప్రజా సమస్యలపై చర్చించేందుకు కీలక వేదికగా ఉందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, అవసరాలు సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి చేరేలా సభ్యులు చేస్తున్న కృషికి సహకరిస్తానని మాధవరావు పేర్కొన్నారు. సభలో ఆరోగ్యకరమైన చర్చలకు ప్రోత్సాహం అందిస్తూ, అన్ని వర్గాల సభ్యుల అభిప్రాయాలకు గౌరవం కల్పించే విధంగా వ్యవహరిస్తానన్నారు. డిప్యూటీ చైర్మన్‌గా మాధవరావు బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన అనుభవం, సభా వ్యవహారాలపై అవగాహన శాసనమండలి కార్యకలాపాలకు మరింత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్సీలు, శాసనమండలి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాధవరావును పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా జైలును సందర్శించిన జడ్జి రామకృష్ణ






**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 19**

ఒంగోలులోని జిల్లా జైలును బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలకు కల్పిస్తున్న వసతి, భోజనం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జైలులో విచారణలో ఉన్న ఖైదీలతో మాట్లాడి, వారి కేసుల వివరాలను తెలుసుకున్నారు. న్యాయ సహాయం అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అర్హత కలిగిన ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదుల సహాయం పొందవచ్చని వివరించారు. అలాగే తమ కేసులకు సంబంధించి న్యాయపరమైన సమస్యలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.వీర రాఘవులు, న్యాయవాదులు ఎం. సింగయ్య, ఎన్.ధనలక్ష్మి, ముబీనా, న్యాయ సేవా సహాయకులు పి.శ్రీనివాసులు, కుమార్ స్వామి, జైలర్ మజ్జి అప్పలనాయుడు, జిల్లా జైలు వైద్యురాలు డాక్టర్ సునీత, జైలు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారాయణరావుకు నివాళులు అర్పించిన కరణం బలరాం, వెంకటేష్ లు





**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 19**

బల్లికురవ మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కరణం అభిమాని శాఖమూరి నారాయణరావు దశ దినకర్మ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఆయన తనయుడు చీరాల వైకాపా ఇన్చార్జి కర్ణం వెంకటేష్ బాబులు హాజరయ్యారు . నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు ., ఆయన కుమారులు శ్రీనివాసరావు , కొండలరావు లను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు పలువురు ఉన్నారు.

# బీసీల రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక అడుగు

### - కూటమి ప్రభుత్వం నిర్ణయం పై బిసి వర్గాల హర్షం

### - ఒంగోలు పార్లమెంటు టిడిపి ప్రధాన కార్యదర్శి కొరారి నాగేశ్వరరావు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 19**

2024 ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు దిశగా తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఒంగోలు పార్లమెంటు టిడిపి ప్రధాన కార్యదర్శి కొరారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలు రామ్ నగర్ 2వ లైన్ లోని పార్లమెంట్ టిడిపి కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం బీసీల రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక అడుగని తెలిపారు. ఇది కేవలం ఎన్నికల హామీని నిలబెట్టుకోవడం మాత్రమే కాకుండా, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యంపై తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తోందని, స్వర్గీయ నందమూరి తారక రామారావు హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి బలమైన పునాది వేశారని గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేశారని, అలాగే బీసీ వర్గాల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని అములులోకి తెచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలకు రాజకీయంగా నష్టం జరిగిందని, ఇప్పుడు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీలకు న్యాయం జరిగిందని అన్నారు. బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానం, రాజకీయ సిద్ధాంతం అన్నారు. బీసీలకు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించడం, వారి నాయకత్వాన్ని ప్రోత్సహించడం తెలుగుదేశం పార్టీ విధానంలో అంతర్భాగంగా కొనసాగుతోందని తెలిపారు.ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి అధ్యక్షతన త్వరలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో బీసీ సోదరుల ఆధ్వర్యంలో కలిసికట్టుగా బీసీల ప్రచార కార్యక్రమాన్ని, కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి నాయకులు కొక్కిలిగడ్డ సముద్రాలు, యాసారపు ఏడుకొండలు, ఎల్లటూరి వేణు, మండపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కాపు కార్పొరేషన్ ను బలోపేతం చేయాలి

### - కాపు సంఘం నాయకులు పిలుపు




**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 19**

కాపు కార్పొరేషన్ ను బలోపేతం చేయాలని కాపు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఒంగోలులోని కాపునాడు కార్యాలయంలో బుధవారం ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో కాపు సామాజిక వర్గ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పలువురు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం నిధులు కేటాయిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో నిధులు అందక కాపు సమాజం నిరాశకు గురైంది అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న కార్పొరేషన్ కు సంబంధించి ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదన్నారు. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం ధోరణిలో కొనసాగుతున్నట్లు భావించాల్సి వస్తుందని వెల్లడించారు. కాపు కార్పొరేషన్ కు తగిన నిధులు కేటాయించి, పెండింగ్ లో ఉన్న సంక్షేమ పథకాలు, రుణాలు, విద్యా సహాయం, స్వయం ఉపాధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు, జనరల్ సెక్రెటరీ దాసరి పిచ్చయ్య నాయుడు, యువజన అధ్యక్షులు బండారు సురేష్ బాబు, పార్లమెంట్ కన్వీనర్ వెలుగోలు కాశీ విశ్వనాథ్, పార్లమెంటు కోశాధికారి చెంగల శెట్టి సుధాకర్, జాయింట్ సెక్రటరీ గారా నారాయణరావు, మహిళా కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నగుబోతు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## కదిరి తిరుపతయ్య ను పరామర్శించిన.. మాజీ ఎమ్మెల్యే కదిరి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 19**

వెలిగండ్ల మండలం లోని నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కదిరి తిరుపతయ్య సతీమణి రసూలమ్మ ఇటీవల అనారోగ్యం తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు బుధవారం నాగిరెడ్డి పల్లి గ్రామంలోని వారి నివాసగృహానికి వెళ్లి కదిరి తిరుపతయ్య ను పరామర్శించారు.రసూలమ్మ అనారోగ్యం తో మృతి చెందడం బాధాకరమన్నారు.ఇలాంటి సమయంలో ధైర్యంగా ఉండాలని మనోధైర్యాన్ని కల్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో కదిరి రమణయ్య, కదిరి మధు,కదిరి బాబు, సుంకరి రంతూ, గట్టు శ్రీకాంత్,గట్టు శేఖర్, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ప్రత్యేక ఫిజియోథెరపీ వైద్య శిబిరం

**వైద్య శిబిరంలో పాల్గొన్న ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని**

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 19**

బల్లికురవ మండల కేంద్రం లోని విద్యార్థుల ప్రత్యేక అవసరాల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఫిజియోథెరపీ వైద్యం ఎంతగానో సహకరిస్తుందని ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఆరుగురు ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఫిజియోథెరపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. మాటలు సరిగా పలకలేని వారికి, ఆటిజం ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి, శారీరక కదలికలు మరింత మెరుగుపడేందుకు ఫిజియోథెరపీ వైద్యం ఎంతగానో ఉపకరిస్తుందని ఆమె తల్లిదండ్రులకు వివరించారు. శిబిరం నిర్వహించిన ప్రతిసారి తమ పిల్లలను తీసుకురావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.



# నేడు కొమరోలు పట్టణంలో ని 7 వీధులకు, తాతిరెడ్డి పల్లె ఫీడర్ లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 19**

కొమరోలు పట్టణంలోని 7 వీధులకు, తాతిరెడ్డి పల్లె ఫీడర్ లోని గ్రామాలకు ఈ నెల 20వ తేదీ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్డిఎస్ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాటు లో భాగంగా ఈనెల 20వ తేదీ గురువారం కొమరోలు పట్టణంతోపాటు,,తాతిరెడ్డి పల్లె ఫీడర్ లో కొత్త లైన్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆకారణంగా కొమరోలు పట్టణంలోని పురుషోత్తమునిపల్లెకు వెళ్లే రోడ్డులోని వీధులకు, ఇండేన్ గ్యాస్ కార్యాలయం గల మెయిన్ రోడ్డు వీధులకు, ఆరె మరాఠీ కాలనీ, శివాజీ నగర్, ఇస్లాంపేట, స్టేట్ బ్యాంక్ వీధి, బ్రాహ్మణ బజార్, సినిమా హాల్ కు వెళ్లే రోడ్డు వీధులతొ పాటు తాతిరెడ్డి పల్లె ఫీడర్ లోని తాతిరెడ్డి పల్లె, పురుషోత్తమునిపల్లి, సరివి రెడ్డి పల్లె, కే బొంతపల్లి గ్రామాలకు ఈనెల 20వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



## స్పోర్ట్స్ ఎక్స్ లెన్స్ అవార్డు 2026కు దరఖాస్తుల ప్రారంభం

### డి ఈ ఓ ఎస్ .సుబ్బారావు.



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 19**

భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చందు జన్మదినాన్ని పురస్కరించుకొని 2026 వ సంవత్సరానికి గాను క్రీడా ప్రతిభ అవార్డులకు మార్కాపురం జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో 2025 - 26 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఆయా పాఠశాలల విద్యార్థుల యొక్క క్రీడా ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయిలో మొదటి ఐదు పాఠశాలలను ఈ అవార్డు లకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కావున ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత దరఖాస్తులను పూర్తి చేసి ఈ ఆగస్టు 25 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు తెలిపారు.

# మండలంలోని నాగులవరం మరియు కాకర్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం

**అర్ధవీడు, పెన్ పవర్, ఆగస్టు 19**

అర్ధవీడు మండలంలోని నాగులవరం, కాకర్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సజ్జా మనోహర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ ని నో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని కావున రైతులందరూ తగు జాగ్రత్తలతో నీటిపై ఆధారపడే దీర్ఘకాలిక పంటలు కాకుండా తక్కువ కాల వ్యవధిలో లాభాలు తెచ్చే పంటలు పండించుకోవాలని సూచించారు. ప్రతి రైతు కూడా తప్పకుండా ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు ఈ -పంట లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరి పంట ఇన్సూరెన్స్ కు ఈనెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. కౌలు పొలాలు సాగు చేస్తున్న రైతులు వీఆర్వో ని సంప్రదించి పంట సాగు హక్కు పత్రం పొందాలని తెలిపారు. రైతులకు యూరియా డిఏపి ఎరువులు రైతు సేవ కేంద్రం, ప్రైవేటు ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ప్రతి రైతు ఎపిఎఫ్ ఆర్ నందు నమోదు చేసుకొని ఫార్మర్ ఐడి నే పొందవలసిందిగా తెలిపారు. భవిష్యత్తులో ఈ ఫార్మర్ ఐడి ని ప్రతి ఒక్క పథకానికి లింక్ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బాల వెంకటేశ్వర్లు, ఉమర్ మరియు రైతులు పాల్గొన్నారు.






# దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్**

**- బాల కాశయ్యకు వినికిడి పరికరం అందజేత**



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 19**

దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్ పేర్కొన్నారు.

శారీరక అంగవైకల్యంలో భాగంగా వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నమనగుండం గ్రామానికి చెందిన గుంటూరు బాలకాశయ్యకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో బుధవారం వినికిడి పరికరాన్ని అందజేశారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ. సత్యానంద్

మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అవసరమైన న్యాయ సహాయం, సంక్షేమ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సి.హెచ్.వి. రామకృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బండిబారిపాలెం బడ్డీ కొట్టులో నగదు దొంగతనం

**గంటల వ్యవధిలో దొంగలను పట్టుకున్న పోలీసులు**





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 19**

సంతమాగులూరు మండలం బండివారిపాలెం గ్రామానికి చెందిన పూండ్ల కొండలు అనే అతని బడ్డీ కొట్టులో రాత్రిపూట దొంగతనానికి గురి కావడం జరిగింది. అయితే ఈ దొంగతనం అదే గ్రామానికి చెందిన పల్లె పోగు అజయ్, చుండి యాకోబు అనేవారు బడ్డీ కోట్టులోని చిల్లర డబ్బులు మరియు కొట్టులోని డబ్బులు మొత్తం 3000/- రూపాయలు అపహరణ చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేయడం జరిగింది. అయితే పోలీసులకు సమాచారం అందగానే పోలీసులు వెంటనే స్పందించి గంటల వ్యవధిలోనే ఆ దొంగలను పట్టుకోనీ విచారించడం జరిగింది. పోలీసులు వెంటనే స్పందించి దొంగలను పట్టుకోవడాన్ని స్థానికులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. తదుపరి వివరాల నిమిత్తం కేసును మరింత దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

# విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

**రూ.7.5 కోట్ల అపరాధ రుసుం విధింపు**

**గిద్దలూరు,పెన్ పవర్, ఆగస్ట్ 19**

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గిద్దలూరు సెక్షన్ పరిధిలో విద్యుత్ చౌర్యం, అక్రమ వినియోగంపై బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు.మార్కాపురం జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులతో కూడిన 46 బృందాలు తనిఖీలు చేపట్టాయి. మొత్తం 284 కేసులను గుర్తించి రూ.7,45,750/-అపరాధారుసుం విధించారు. ఈ తనిఖీల్లో విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.ఎ కరీం, డి.పి.ఇ ఇఇ ఎ. సత్యనారాయణ, మార్కాపురం డివిజన్ ఇ.ఇ పి.వి నాగేశ్వరరావు,డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్‌ను కలిసిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావు

**-డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వక భేటీ**

**-వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మాధవరావు**



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 19**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తూమాటి మాధవరావు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ చైర్మన్‌గా కీలక బాధ్యతలు చేపట్టిన అనంతరం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా తూమాటి మాధవరావు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానని, శాసనమండలి గౌరవాన్ని కాపాడుతూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తానని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సందర్భంగా తూమాటి మాధవరావు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య కొద్దిసేపు సమావేశం జరిగింది. శాసనమండలిలో తన కొత్త బాధ్యతలు, సభా వ్యవహారాల నిర్వహణ తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని మాధవరావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకురావడంలో సభ్యులకు సహకరిస్తూ, సభా సంప్రదాయాలు, గౌరవాన్ని కాపాడే విధంగా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు.

**కొత్త బాధ్యతలపై ఆసక్తి ...**

తూమాటి మాధవరావు డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనకు పార్టీ శ్రేణులు, నాయకులు, శాసనమండలి సభ్యులు అభినందనలు తెలియజేస్తున్నారు. తాజాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలపడం ద్వారా తన కొత్త బాధ్యతల పట్ల ఆయనలో ఉన్న నిబద్ధతను వెల్లడించారు.ఈ భేటీ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాధవరావుకు శుభాకాంక్షలు తెలియజేసి, డిప్యూటీ చైర్మన్‌గా సభా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# బడుగు బలహీన వర్గాలకు అండగా ఉన్నది తెలుగుదేశం పార్టీ ఒక్కటే

**పీసీపల్లి, పెన్ పవర్ ఆగస్టు 18:**



రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారికి రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించి అట్టడుగు వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని ఒంగోలు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య అన్నారు.మంగళవారం పి.సి.పల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి ఎన్టీఆర్, ఆ తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను అన్ని రంగాల్లో అణగదొక్కిందని విమర్శించారు. "వారి రాజకీయ ఎదుగుదలను ఓర్చుకోలేక 34% రిజర్వేషన్లను 24%కు కుదించారు. బీసీలపై దాడులు చేయించి కుటుంబాలకు అన్యాయం చేశారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గట్టి బుద్ధి చెప్పారన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24% ఉన్న బీసీ రిజర్వేషన్లను 36%కు పెంచి న్యాయం చేసిందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని ఆకాంక్షించారు.

**కనిగిరి ఎమ్మెల్యేపై ప్రశంసలు**

కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బీసీలపై ప్రత్యేక ప్రేమ చూపిస్తున్నారని, బలహీన వర్గాలపై ఏ చిన్న దాడి జరిగినా వెంటనే స్పందించి న్యాయం చేస్తున్నారని కొనియాడారు. ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకుంటున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరూ పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు.

**రజక, వడ్డెర కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

రేపు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో ముఖ్యంగా రజక జాతి వారికి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ని కోరారు.

రాజకీయ నేపథ్యం లేని వడ్డెర కులానికి చెందిన రమాదేవి కి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి బీసీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని నిరూపించారని, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి, యువ నాయకులు నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. "రాష్ట్రంలో బలహీన వర్గాలకు అండగా ఉండేది తెలుగుదేశం పార్టీ ఒక్కటే. కనిగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో బీసీలు పూర్తిగా టీడీపీకి అండగా నిలుస్తారు" అని కోమటిగుంట్ల వీరయ్య స్పష్టం చేశారు.

# పొగాకు బోర్డులో రిజిస్టర్ కాబడిన రైతులే పంట సాగు చేయాలి.

**పొన్నలూరు, పెన్ పవర్ ఆగస్టు 19**

మండల కేంద్రమైన పొన్నలూరులో బుధవారం 26వ వేలంకేంద్రం ఆధ్వర్యంలో పొగాకు రైతులకు సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్ ప్రత్యూష మాట్లాడుతూ పొగాకు బోర్డులో రిజిస్టర్ కాబడిన రైతుల మాత్రమే పొగాకు సాగు చేపట్టాలని, రిజిస్టర్ కానీ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పొగాకు పంట సాగు చేయవద్దని రైతులకు తెలిపారు. రైతులు తమ కేటాయించిన కోటా మేరకే పండించాలని, అధిక విస్తరణంలో పండించకూడదని వారికి సూచించారు, బ్యారన్ ఒక్కంటికి 21 కింటాలు మాత్రమే పండించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టొబాకో ఓ ఎఫ్ ఓ మనీషా, రైతులు పల్లపోతు సురేంద్రబాబు, నేలపాటి మాధవరావు, కల్లూరి చెంచురామయ్య, కంచర్ల రామ్ కుమార్, మండవ కృష్ణారావు, ఆదయ్య తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ

**వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ప్రముఖ వ్యాపార వేత్త మండవ మురళీకృష్ణ**



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 19**

సూర్య శ్రీ దివ్యంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు కర్నూల్ రోడ్ లోని సెయింట్ జేవియర్స్ పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ అందజేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ కోసం దాతలు ఆద్మీదియం కిరణ్, వడలకుంట రాఘవేంద్ర, కోలి సునీల్ లక్ష 20 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు పరిశుభ్రమైన మంచినీరు అందించేందుకు ట్రస్టు ద్వారా మినరల్ (ఆర్వో) వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు సర్దార్ బాషా, షాహిన్, మానవతా సేవా సమితి అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, ట్రస్టు గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ బాల సుందరి, ఇంగ్లీష్ మీడియం హెచ్ఎం సిస్టర్ జయసీల , మేరీ నక్షత్రం, వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్టు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 19**

మద్దిపాడు మండలంలోని ఇనమనమెల్లూరు గ్రామ శివారులో బుధవారం టాస్క్ ఫోర్స్ ఇంచార్జి సిఐ కమలాకర్ పేకాట స్థావరంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.28,420/- నగదు, మూడు మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. వారిని స్థానిక మద్దిపాడు పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.

# మాజీ ఎమ్మెల్యే కదిరి ని కలిసిన డాక్టర్ మల్లికార్జున రెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 19**

కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు ను బుధవారం శీలంవారిపల్లి క్యాంపు కార్యాలయం లో పామూరు మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్. పి.మల్లికార్జున రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కదిరి బాబురావు ను శాలువాతో సత్కరించారు.



# ఘనంగా ఫోటో గ్రాఫర్ల దినోత్సవం

## భారీ ర్యాలీ- రక్త దాన శిబిరం





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 19**

గిద్దలూరు పట్టణంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఫోటోగ్రాఫర్స్,వీడియో గ్రాఫర్స్ , ఫ్లెక్సీ యాజమాన్యల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు ఫోటోగ్రాఫర్లు,వీడియో గ్రాఫర్లు, ఫ్లెక్సీ ప్రింటింగ్ యాజమాన్యాల యువకులు పాల్గొని రక్తదానం చేశారు. 1839 ఆగస్టు 19న ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ఫ్రాన్స్ దేశం కు చెందిన లూయిస్ డాగురే ఫోటో కెమెరాని కనిపెట్టిన సందర్భంగా ఈ కార్యక్రమం జరుపుకుంటామని గిద్దలూరు ఫోటోగ్రాఫర్ల, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు బొంత ప్రభాకర్ అన్నారు. ఇప్పటికీ 187 సంవత్సరాలు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన అందరిని అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణబాబు, యూనిక్ ఫోటో ల్యాబ్ హరిబాబు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు స్వరూప రెడ్డి, గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ ఆదాం హాజరై ఫోటోగ్రాఫర్ల, వీడియో గ్రాఫర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు పట్టణంలో ఫోటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శరత్ బాబు, సెక్రటరీ ఖాన్, ట్రెజరర్ సుబ్బరాయుడు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు, వెంకటరెడ్డి, వినాయక చంద్ర, న్యూ రామా శీను, భాష స్టూడియో భాష, పిల్ల క్రిష్ణ,రంగడు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరులో నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు

### వెలుగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్లు





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 19**

వెలుగొండ ప్రాజెక్టు ద్వారా ఈ నెలాఖరులోపు నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు తరలించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు.బుధవారం అమరావతి లోని అసెంబ్లీ ప్రాంగణంలో వెలుగొండ నిర్వాసితులకు సీఎం చంద్రబాబు నాయుడు రూ.200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది, ప్రారంభోత్సవం చేస్తోంది సీఎం చంద్రబాబు నాయుడేనని అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను చంద్రబాబు నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం తొలి విడతగా రూ.318 కోట్లు, రెండో విడతగా రూ.200 కోట్లు నిర్వాసితులకు చెల్లించిందని, మిగిలిన రూ.400 కోట్లను త్వరలోనే ఇచ్చి ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు నీరిస్తామని చెప్పారు. పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత గత ప్రభుత్వానిదేనని విమర్శించారు.ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ చెప్పినట్లే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, వెలుగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి ప్రారంభిస్తున్నారని అన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## వడ్డెర మహిళ రమాదేవి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం అభినందనీయం

### దేవండ్ల తిరుపతయ్య



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 19**

వడ్డెర సమాజానికి చెందిన దళవాయి రమాదేవిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్డీఏ కూటమి తరఫున ఖరారు చేసి, అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడంపై మండలంలోని వడ్డెర సమాజ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవండ్ల తిరుపతయ్య ఆధ్వర్యంలో పలువురు వడ్డెర సమాజ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవండ్ల తిరుపతయ్య మాట్లాడుతూ వడ్డెర సమాజానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలోని మహిళలకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తూ వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో వడ్డెర సమాజానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వడ్డెర సమాజంలోని పేదలు, కార్మికులు, మహిళలు, యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వడ్డెర సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కడం వడ్డెర సమాజానికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిందన్నారు ఎమ్మెల్సీగా సమాజ సమస్యలను పరిష్కరించాలని కోరారు

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న దామచర్ల సత్య.

**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 19**

మండలంలోని ఉప్పలదిన్నె గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా ఆమె దశదిన కార్యక్రమంలో బుధవారం రాష్ట్ర మారీ టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య తులసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల టిడిపి నాయకులు మండవ ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు, అనుమోలు సుధాకర్ బాబు, మండవ మురళీమోహన్, కొండ్రగుంట నరసయ్య, పి కృష్ణమూర్తి, ఏలూరు రాంబాబు, పాతూరి కోటయ్య తదితరులు ఉన్నారు.




## బయిటకొస్తున్న గ్రూప్ వన్ చిట్టా...



**కడప, ఆగస్టు 19, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో నిరుద్యోగ నియామకాల అంశం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తోంది. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, వైఎస్ఆర్సీపీ దీనిని ప్రధాన అస్త్రంగా చేసుకుని నిరసనలకు దిగుతోంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 నియామకాల మూల్యాంకన అక్రమాలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించిన నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడటంతో వైఎస్ఆర్సీపీ ఇబ్బందుల్లో పడుతోంది. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తీవ్రమైన ఉల్లంఘనలు, సీసీటీవీల తొలగింపు, నియమావళికి విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులతో వ్యాల్యుయేషన్ చేయించడం, వావ్= స్లిప్పుల రీ-ప్రింటింగ్ వంటి అక్రమాలు జరిగినట్లు సిట్ విచారణలో ఆధారాలు లభించాయి. ఒక్క నిర్ణయం వెనుక నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాకుండా, నిర్దిష్ట అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు వ్యవస్థీకృత ప్రణాళిక నడిచిందని ఫోరెన్సిక్ ఆధారాలు చెబుతున్నాయి.సాధారణంగా నంబర్-1 స్థాయి రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో ఏజెన్సీలు నిబంధనలు ఉల్లంఘించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు లేదా బోర్డు సభ్యుల పాత్రపై దృష్టి సారిస్తాయి. గ్రూప్-1 వ్యవహారంలో నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి మరియు సంబంధిత ఉన్నతాధికారుల నిర్ణయాలపై ఇప్పటికే విచారణ సాగింది. అయితే, ఎలాంటి పొలిటికల్ గ్రీన్ సిగ్నల్ లేకుండా అంత పెద్ద వ్యవస్థాత్మక మార్పులు, ఓఎంఆర్ షీట్ల ప్రైవేటీకరణ లాంటి చర్యలు జరగడం అసాధ్యమనే వాదన బలంగా ఉంది.కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేవలం ఒక విభాగానికి సంబంధించిన రిక్రూట్‌మెంట్ లోపంగా చూడటం లేదు. వైఎస్ఆర్సీపీ హయాంలో ముఖ్యమంత్రి కార్యాలయం , నాటి ముఖ్య నాయకుల సూచనలతోనే ఈ నియామకాల నిబంధనల్లో మార్పులు చేశారన్న కోణంలో సాక్ష్యాధారాలు సేకరిస్తే, విచారణ రాజకీయ నేతల దాకా వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. గతంలో సిఐడి దర్యాప్తులో ఐఏఎస్ అధికారులను ప్రశ్నించినప్పుడు కొందరు ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి ఒత్తిళ్ల వల్లే నిబంధనలు మార్చామని పరోక్షంగా చెప్పడం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ప్రస్తుత డీఎస్సీపై పోరాటం చేయడం ద్వారా నిరుద్యోగుల మద్దతు కూడగట్టాలని చూస్తున్న వైఎస్ఆర్సీపీ గ్రూప్-1 దర్యాప్తు ఒక పెద్ద అడ్డంకిగా మారింది. మా హయాంలో సుదర్శన చక్రంలా పారదర్శకంగా మార్చాం అని చెప్పుకుంటున్నా, హైకోర్టు ఆదేశాలు , సిట్ నివేదిక వైఎస్ఆర్సీపీ వాదనను బలహీనపరుస్తున్నాయి. ఈ కేసు తీవ్రతరం అయితే, ప్రతిపక్ష నాయకులు రాజకీయంగా మరింత రక్షణలోకి వెళ్లాల్సి వస్తుందిఈ నివేదిక ఆధారంగా కోర్టు ఇచ్చే ఆదేశాలు అత్యంత కీలకం కానున్నాయి. కేవలం అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మాత్రమే కాకుండా నాటి విధాన నిర్ణేతలు, ప్రభుత్వ సలహాదారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇది వైఎస్ఆర్సీపీలోని అగ్రనాయకత్వానికి ఊహించని రాజకీయ ప్రతిబంధకంగా మారనుంది. ఏపీలో రాజకీయం ఇప్పుడు రిక్రూట్‌మెంట్లు, స్కామ్‌ల చుట్టూ తిరుగుతోంది. గ్రూప్-1 అక్రమాల బాధ్యతను అధికారులపై మాత్రమే నెట్టివేసి ముగిస్తారా లేక సూత్రధారులను చట్టం ముందు నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుందా అన్నది రాబోయే రోజుల్లో సిట్ ఇచ్చే తుది ఛార్జ్‌షీట్‌తో తేలనుంది.

## క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి



**విజయవాడ, నెల్లూరు, ఆగస్టు 19, పెన్ పవర్:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూల్ ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యాచరణతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

**మండలిలో..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని వదిలేదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది. అప్పటివరకు అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం నిరాటంకంగా ప్రతిపక్ష వైఫల్యాలను, గత ఐదేళ్ల పాలనా లోపాలను ఎండగడుతూనే ఉంటుంది. శాసనసభ రికార్డుల్లో నమోదయ్యే అధికారిక చర్చలకు ఉండే రాజ్యాంగబద్ధమైన విలువ, మీడియా పాయింట్ల వద్ద లేదా పార్టీ కార్యాలయాల్లో పెట్టే ప్రెస్ మీట్లకు ఎప్పటికీ ఉండదనే ప్రాథమిక పార్లమెంటరీ సూత్రాన్ని వైఎస్సార్‌సీపీ విస్మరించడం చర్చనీయాంశంగా మారింది.ప్రజాస్వామ్యంలో అధికార పక్షం తప్పులను ఎత్తిచూపేందుకు దక్కిన సంఖ్యాబలాన్ని సద్వినియోగం చేసుకోకుండా, కేవలం మైకు ఇవ్వలేదనో లేక ప్రతిపక్ష హోదా రాలేదనో సాకులు చెబుతూ సభా వేదికల నుంచి పారిపోవడం ప్రజల్లో మరింత చులకన భావాన్ని పెంచుతుంది. ప్రెస్ మీట్లు, సోషల్ మీడియా పోస్టులతో కేవలం తమ సొంత కేడర్‌ను మాత్రమే సంతృప్తిపరచగలరు తప్ప, శాసనసభ వేదికగా ప్రజలకు జవాబుదారీతనాన్ని చాటుకోలేరు. ఈ పార్లమెంటరీ వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకోకపోతే ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ రాజకీయ మనుగడ మరింత క్లిష్టతరంగా మారే ప్రమాదం ఉంది

## పాకిస్థాన్ , ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు రంగం సిద్ధం.. పూర్తి షెడ్యూల్, జట్లు, లైవ్ స్ట్రీమింగ్ ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ టూర్ లో భాగంగా 3 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 19 నుంచి 23 వరకు లీడ్స్‌లోని హెడింగ్లే వేదికగా జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ ఆగస్టు 27 నుంచి 31 వరకు చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో, మూడో టెస్ట్ సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరగ ునుంది. జూన్ 2027లో ది ఓవల్‌లో జరగబోయే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో టాప్-2లో నిలవాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్ గెలవడం అత్యంత కీలకంగా మారింది.

బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ తర్వాత ఇంగ్లాండ్ ఆడుతున్న తొలి రెడ్-బాల్ సిరీస్ ఇది. ఈ సిరీస్ కోసం జో రూట్ తిరిగి ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. తొలి రెండు టెస్టుల కోసం డ్యాన్ లారెన్స్, మాజీ వైస్ కెప్టెన్ ఆలీ పోప్ జట్టులోకి పునరాగమనం చేయగా, గాయం కారణంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొలి రెండు టెస్టులకు ప్రకటించారు.

### పాకిస్థాన్‌కు కెప్టెన్ గాయం టెన్షన్.. అఫ్రిది ఔట్:

మరోవైపు పాకిస్థాన్ జట్టు బాబర్ అజామ్ సారథ్యంలో బరిలోకి దిగుతోంది. జూలై 2026లో షాన్ మసూద్ స్థానంలో బాబర్ టెస్ట్ కెప్టెన్సీ చేపట్టినప్పటికీ, వేలి గాయం కారణంగా లీడ్స్‌లో జరిగే తొలి టెస్టుకు అతను ఆడటం అనుమానంగా మారింది. ఇక స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిదిని ఈ పర్యటనకు ఎంపిక చేయకపోవడంతో సీనియర్ బౌలర్ మహమ్మద్ అబ్బాస్ పాక్ పేస్ విభాగాన్ని నడిపించనున్నాడు.

### లైవ్ స్ట్రీమింగ్ వివరాలు


భారతదేశంలో ఈ ఇంగ్లాండ్ వర్సెస్ పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ (ూశీఅవ ూజూశీ౯ం చీవ్షశీతీ౨) టీవీ ఛానెళ్లలో ప్రత్యక్షంగా చూడవచ్చు.. అలాగే డిజిటల్ వీక్షకులు సోనీ లివ్ (ూశీఅవ ూ×ఎ) యాప్‌లో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా మ్యాచ్‌లను వీక్షించవచ్చు. తొలి టెస్ట్ మ్యాచ్ ప్రతిరోజు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమవుతుంది.

### ఇరు జట్లు:

పాకిస్థాన్ జట్టు: బాబర్ అజామ్ (కెప్టెన్), షాన్ మసూద్, అబ్దుల్లా షఫీక్, అజాన్ అవాయిస్, ఇమామ్-ఉల్-హక్, ముహమ్మద్ అవాయిస్ జాఫర్, మహమ్మద్ రిజ్వాన్ (కీపర్), ముహమ్మద్ ఘాజీ ఘోరీ (కీపర్), అమీర్ జమాల్, సల్మాన్ అలీ ఆగా, సౌద్ షకీల్, అలీ ఉస్మాన్, సాజిద్ ఖాన్, ఖుర్రం షెహజాద్, మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ, ఉబైద్ షా

ఇంగ్లాండ్ జట్టు: జో రూట్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, బెన్ డకెట్, మాథ్యూ ఫిషర్, ఎమిలియో గే, డ్యాన్ లారెన్స్, ఆలీ పోప్, ఆలీ రాబిన్సన్, జేమీ స్మిత్, జోష్ టంగ్

## డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్.. టెన్నిస్ నుంచి నిక్ కిర్గియోస్ సస్పెండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్, మాజీ వరల్డ్ నంబర్ 13 నిక్ కిర్గియోస్ నిషేధిత డ్రగ్స్ వాడుతూ దొరికిపోవడంతో క్రీడా ప్రపంచంలో తీవ్ర కలకలం రేపుతుంది. ఇటీవల నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో అతను డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడంతో ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ అతనిపై సడన్‌గా ప్రొవిజనల్ బ్యాన్ విధించింది. జూన్ 22న జరిగిన మల్లోర్కా ఓపెన్ టోర్నీ సందర్భంగా నిక్ కిర్గియోస్‌కు డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో అతను కొకైన్ వాడినట్లు నిర్ధారణ కావడంతో ఆగస్టు 4వ తేదీన అతనిపై తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సస్పెన్షన్ అమలులో ఉన్నంత వరకు అతను గ్రాండ్‌స్లామ్‌లు సహా ఎలాంటి ప్రొఫెషనల్ టెన్నిస్ టోర్నమెంట్లలో ఆడటానికి, కోచింగ్ ఇవ్వడానికి లేదా చివరికి మ్యాచ్‌లకు హాజరవడానికి కూడా పర్మిషన్ ఉండదు. ఈ షాకింగ్ న్యూస్ బయటకు రాగానే నిక్ కిర్గియోస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ.. తన తప్పును బహిరంగంగా ఒప్పుకున్నాడు. నేను ఒక విపరీతమైన పెద్ద తప్పు చేశాను, దానికి పూర్తి బాధ్యత నాదే.. నా అభిమానులు, కుటుంబం, స్పాన్సర్లు, ముఖ్యంగా నన్ను రోల్ మోడల్‌గా భావించే పిల్లలకి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను. నావల్ల ఇలాంటి రాంగ్ ఎగ్జాంపుల్ సెట్ అయినందుకు నా మీద నాకే చాలా నిరాశగా ఉందంటూ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు.

### డిప్రెషన్ పై మనసు విప్పిన టెన్నిస్ స్టార్:

తన పరిస్థితికి గల కారణాలను వివరిస్తూ.. గడిచిన రెండేళ్లుగా మోకాలు, మణికట్టు గాయాలతో శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యానని చెప్పాడు. మైండ్ అనుకున్నట్లు శరీరం సహకరించకపోవడంతో, కెరీర్ ముగింపునకు వచ్చేసిందనే ఘోరమైన సత్యాన్ని తట్టుకోలేక చాలా ఒంటరిగా, నిస్సహాయంగా ఫీల్ అయ్యానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ తప్పును సరిదిద్దుకోవడానికి రాబోయే 28 రోజుల పాటు సోషల్ మీడియాకు, పబ్లిక్ లైఫ్‌కు దూరంగా ఉంటానని ప్రకటించాడు.

### డేంజర్‌లో పడిన ప్రొఫెషనల్ కెరీర్:

గాయాల సమస్యల వల్ల ఈ సీజన్‌లో కేవలం నాలుగు సింగిల్స్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన 31 ఏళ్ల నిక్ కిర్గియోస్, చివరిగా వింబుల్డన్ డబుల్స్‌లో ఆడి ఫస్ట్ రౌండ్‌లోనే నిష్క్రమించాడు. ఇప్పుడు ఈ కొకైన్ రచ్చతో అతని ప్రొఫెషనల్ కెరీర్ మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తప్పును రియలైజ్ అయి బ్రేక్ తీసుకుంటున్న కిర్గియోస్, మళ్లీ లైఫ్‌ను ట్రాక్‌లోకి తెచ్చుకుని ఎంతవరకు స్ట్రాంగ్‌గా కంబ్యాక్ ఇస్తాడో లేదో అనేది వేచి చూడాల్సింది.

## శ్రీలంక గడ్డపై మానవ్ సుతార్ చరిత్ర.. దిగ్గజాల రికార్డులు బ్రేక్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక గడ్డపై భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్ చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి, టీమిండియా దిగ్గజాలు హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్‌ల రికార్డులను అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో 10/131 గణాంకాలతో శ్రీలంకలో ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. లంకలో 10 వికెట్ల ఘనత సాధించిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. సుతార్ విజృంభణకు దేవదత్ పడిక్కల్ సెంచరీ తోడవడంతో భారత్ 165 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

### మ్యాచ్ సాగిందిలా..

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (230 బంతుల్లో 167; 15 ఫోర్లు, 1 సిక్స్) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కేఎల్ రాహుల్ (82), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (51) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య 4 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక, భారత స్పిన్నర్ల ధాటికి 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో నిరోషన్ డిక్వెల్లా (80), సోనల్ దినుష (100) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, మానవ్ సుతార్ (4/76) విజృంభించడంతో శ్రీలంక 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్‌కు 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### సుతార్ స్పిన్ మ్యాజిక్

రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు తడబడ్డారు. రిషభ్ పంత్ (66 బంతుల్లో 69), పడిక్కల్ (44), రాహుల్ (35) మినహా ఎవరూ రాణించకపోవడంతో భారత్ 193 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక బౌలర్లలో అసిథ ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు తీశారు. దీంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక మరోసారి తడబడింది. 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయితే, ధనంజయ డిసిల్వా (59), సోనల్ దినుష (84) మరోసారి పోరాడి 91 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేపారు. కానీ, మానవ్ సుతార్ తన స్పిన్‌తో మాయ చేశాడు. కేవలం 10 బంతుల వ్యవధిలో లోయర్ ఆర్డర్‌ను కుప్పకూల్చి శ్రీలంక పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 6/55 గణాంకాలతో అదరగొట్టడంతో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. ప్రసిధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా, సిరాజ్, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ఈ అద్భుత ప్రదర్శనతో మానవ్ సుతార్ మ్యాచ్ హీరోగా నిలిచాడు.

## ట్రెండ్‌గా మారుతున్న జాంబీ సినిమాలు!



స్టైలిష్ గ్రే క్రాప్ టాప్ లుక్‌లో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తున్న ప్రియాంక ఖోల్గాడే





సాంప్రదాయక రూపంలో శ్రియా శరణ్ కాలాతీతమైన హుందాతనాన్ని ప్రదర్శిస్తున్నారు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చిత్ర పరిశ్రమలో ఎప్పటికప్పుడు కొత్త జోనర్స్ తెరపైకి వస్తున్నాయి. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడానికి దర్శకులు విభిన్నమైన కాన్సెప్ట్‌లతో ప్రయోగాలు చేస్తున్నారు. ఆ కోవలోనే కొన్ని సంవత్సరాల క్రితం టాలీవుడ్‌లో ప్రశాంత్ వర్మ అద్భుతమైన సృజనాత్మకతతో తెరకెక్కించిన -జాంబీ రెడ్డి- సినిమాతో హర్రర్-కామెడీ జాంబీ కాన్సెప్ట్ అధికారికంగా పరిచయమైంది. తెలుగు ప్రేక్షకులకు పూర్తిగా కొత్తనైన జానర్‌ను దర్శకుడు అత్యంత వినోదాత్మకంగా మలచడంతో ఈ ప్రయోగం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. -జాంబీ రెడ్డి- సృష్టించిన ట్రెండ్ ఒక చిత్రంతో ఆగిపోకుండా ఇండియన్ స్క్రీన్ మీద సరికొత్త ట్రెండ్‌గా వేగంగా మారుతోంది. భయంతో పాటు కడుపుబ్బా నవించే కామెడీని మిక్స్ చేసి తెరకెక్కించే జాంబీ జోనర్‌పై నేటి యువ ప్రేక్షకులు మంచి ఆసక్తి చూపిస్తున్నారు. హాలీవుడ్ సినిమాలకు మాత్రమే పరిమితం అనుకున్న జాంబీ కాన్సెప్ట్‌ను భారతీయ నైటివిటీకి తగ్గట్టుగా మార్చి తెరపై ఆవిష్కరిస్తుండటంతో మేకర్స్‌కు కూడా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి. ఈ విజయవంతమైన బాటలోనే ఇప్పుడు మరిన్ని భారీ ప్రాజెక్ట్‌లు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాయి. -జాంబీ రెడ్డి- చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న -జాంబీ రెడ్డి 2-పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. ఈసారి మరింత విస్తృతమైన గ్రాఫిక్స్ .. వినోదంతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం కంటే రెండవ భాగం మరింత వైవిధ్యంగా ఉంటుందని ప్రేక్షకులను సీట్లలో కూర్చోబెట్టేలా అదిరిపోయే హర్రర్-కామెడీ ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది. ఇక బాలీవుడ్‌లోనూ జాంబీ జోనర్ జోరు భారీగా పెరిగింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం -ప్రళయ్- కూడా ఇదే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కుతున్న చిత్రం బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. రణ్‌వీర్ సింగ్ లాంటి స్టార్ హీరో ఈ జోనర్‌లో నటిస్తుండటంతో సినిమాపై జాతీయ స్థాయిలో భారీ హైప్ క్రియేట్ అవుతుంది. మరోవైపు కోలీవుడ్‌లోనూ ఈ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ప్రభుదేవా .. నవ్వుల రారాజు వడివేలు ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న -బ్యాంగ్ బ్యాంగ్- సినిమా కూడా జాంబీ కామెడీ నేపథ్యంలోనే రూపొందుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హర్రర్-కామెడీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు అంతులేని నవ్వులను పంచడం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఒకరికొకరు పూర్తిగా భిన్నమైన శైలి కలిగిన ఇద్దరు దిగ్గజాలు జాంబీలతో చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం పక్కా. మొత్తంగా ప్రశాంత్ వర్మ విత్తిన జాంబీ రెడ్డి చిన్న మొక్క నేడు ఇండియన్ సినిమా పరిశ్రమలో పెద్ద వృక్షలా ఎదిగుతోందన్నది కాదనలేని నిజం. రొటీన్ లవ్‌స్టోరీలు, యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఇలాంటి ప్రయోగాత్మక జాంబీ కాన్సెప్ట్‌లను ప్రేక్షకులు ఆదరిస్తుండటం శు భపరిణామం. రాబోయే రోజుల్లో భారతీయ తెరపై జాంబీ సినిమాల జోరు మరింత పెరిగి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com